నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 2 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




మై వీ3 యాడ్స్ యాప్‌లో రోజూ వారి ఆదాయం, మొత్తం ఆదాయం, ఇప్పటి వరకు మహేశ్‌కు వచ్చిన బ్యాలెన్స్ వివరాలు

# యాడ్స్ పేరిట మోసం

## మై వీ 3 యాడ్స్ కంపెనీ కుచ్చుటోపీ

“మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణానికి చెందిన మహేశ్ కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. సరిగ్గా ఏడాది క్రితం ఓ స్నేహితుడు వచ్చి.. మై వీ3 యాడ్స్ యాప్‌లో వాళ్లు పంపించే యాడ్స్ చూస్తే రోజూ రూ.430 ఇస్తున్నారు. ఇంట్లో ఉండే గత నెలలో నేను రూ.12,900 సంపాదించాను. నువ్వు కూడా జాయిన్ అవ్వు అన్నాడు. ఓ వ్యక్తిని తీసుకువచ్చి పరిచయం కూడా చేశాడు. ఇలా రోజుకు రూ.430 రావాలంటే ముందు రూ.1.20,000 పెట్టుబడి పెట్టాలని చెప్పారు. ఎవరినైనా జాయిన్ చేపిస్తే వారి పేరుపైనా రోజూ రూ.200లు అదనంగా ఆదాయం వస్తుందని చెప్పి నమ్మించారు. యాప్ చూపించి, దాని నుంచి డ్రా చేసుకున్న డబ్బుల వివరాలను చూపించడంతో మహేశ్ నిజమే అనుకున్నాడు. భార్య నగలు కుదువపెట్టి రూ.1.20,000 యాప్‌లో పెట్టాడు. తనతో పాటు తన తమ్ముడిని కూడా మరో రూ.1.20,000 పెట్టి జాయిన్ చేయించాడు. వాళ్లు పంపించే యాడ్స్ చూస్తుంటే రోజూ.430 వాలెట్‌లో యాడ్ అవుతూ వచ్చాయి. ఉన్నఫలంగా ఓ రోజు యాప్ ఓపెన్ కాలేదు. ఆరా తీస్తే నిర్వాహకులను అరెస్టు చేశారు. కొన్ని రోజుల సమయం పడుతుంది అంటూ తనను జాయిన్ చేసిన వ్యక్తి బాంబ్ పేల్చాడు. దీంతో మహేశ్ తాను మోసపోయిన విషయాన్ని తెలుసుకొని లబోదిబో మంటున్నాడు.”

- ముందు రూ.1.20 లక్షలు పెట్టుబడి పెడితేచాలు చేతినిండా సంపాదించవచ్చని బోల్తా
- రోజుకో గంట కేటాయిస్తే రూ.430 వస్తాయని మోసం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వేలాది మంది బాధితులు
- తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉంటారని అంచనా
- తమిళ నాడులో నిర్వాహకులు అరెస్టుతో బయటపడిన వ్యవహారం
- ఇప్పటికీ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న సంస్థ ప్రతినిధులు
- ఈ తరహా ఘటనలపై అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు





మంచిర్యాల, మార్చి 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) :

.. ఇలా ఈ ఇద్దరే కాదు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా దాదాపు నాలుగు వేల నుంచి ఐదు వేల మంది దాకా మోసపోయి ఉంటారని బాధితులు చెబుతున్నారు. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో మై వీ3 యాడ్స్‌లో దాదాపు 10 లక్షల మంది ఉన్నారని, ఇందులో సగం మంది తెలంగాణకు చెందిన వారే ఉన్నారని తెలుస్తున్నది. ఇంట్లో కూర్చొని యాడ్స్ చూస్తూ ప్రతి నెలా లక్షల్లో సంపాదించుకోవచ్చని చెబుతారు. వారి ఫోన్‌లలోని యాప్‌లోగల వాలెట్‌లో ఉన్న డబ్బులు, అందులో నుంచి డ్రా చేసుకున్న నగదు వివరాలు చూపిస్తారు. ప్రసెంటేషన్ ఇచ్చి నెలకు రూ.5 లక్షల దాకా వెనుకేసుకోవచ్చని లెక్కలేసి మరీ చూపిస్తారు. మీము మీలాగే వచ్చామని.. ఎన్నో కష్టాలు పడ్డామని, వై వీ3 యాడ్స్‌లో జాయిన్ అయ్యాక లైఫ్‌లో సెటిల్ అయ్యామని.. వారినే ఎగ్జామ్‌పుల్‌గా చూపిస్తారు. ఇవన్నీ నమ్మి ఒక్కసారి పెట్టుబడి పెట్టామా.. సంపాదించడం సంగతి దేవుడెరుగు పెట్టిన పెట్టుబడి కూడా అటే పోతున్నది.

### ఇది స్కీమ్ ప్లాన్

మై వీ3 యాడ్స్ యాప్ స్కీమ్‌లో రూ.1,20,000 పెట్టుబడి పెట్టాలి. రోజూ యాప్‌లో యాడ్స్ వస్తాయి. ఫోన్‌లోనే లాగిన్ అయ్యి వచ్చే యాడ్స్ చూడాలి. యాడ్‌కు రూ.5 నుంచి రూ.10, రూ.15 వరకు చెల్లిస్తారు. రోజు ఓ గంట పాటు కూర్చుంటే రూ.430 వస్తాయి. ఈ పని అయ్యాక మీరు రోజూ వారి పని చేసుకోవచ్చు. మీ కింద 8 మందిని జాయిన్ చేసుకునే అవకాశం ఉంటుంది. మీ కింద జాయిన్ అయ్యే ఒక్కో వ్యక్తి మీద రోజుకు రూ.200 చొప్పున మీకు అదనపు ఆదాయం వస్తుంది. ఒక్కొక్కరి నుంచి రూ.200 చొప్పున రోజుకు రూ.1600, యాడ్స్ చూస్తే వచ్చే రూ.430 మొత్తం 19,030 సంపాదించుకోవచ్చు. అంటే నెలలో రూ.5,70,900 వస్తాయి. ఏడాదికి రూ.68.50 లక్షలు సంపాదించవచ్చు. రెండేళ్లలో మీరు కోట్లు సంపాదిస్తారు. మీరు సంపాదించే ప్రతి వంద రూపాయల్లో పది రూపాయలు టూర్ వ్యాలెట్‌లో జమ అవుతాయి. అలా రూ.50 వేలు అయ్యాక ఆ డబ్బులతో మిమ్ములను టూర్‌లకు తీసుకెళ్తాం. థాయిలాండ్, గోవాతో పాటు ఇండియాలో టూర్‌లు ఉంటాయి. మీరు ఏది చూడాలనుకంటే అది చూడొచ్చు. డబ్బులు సంపాదిస్తూ జీవితాన్ని ఎంజాయ్ చేయొచ్చు.




మై వీ3 యాడ్స్ యాప్





### తమిళ నాడు కేంద్రంగా దందా..

మై వీ3 యాడ్స్ కంపెనీ తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఉంది. హెడ్ ఆఫీస్ అక్కడే ఉంది. శక్తి ఆనంద్ అనే వ్యక్తి దీన్ని స్థాపించారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం ఇద్దరు డైరెక్టర్లు ఉన్నారు. ఏరియాకు ఒక టీమ్ లీడర్ ఉంటారు. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు ఉన్నాయి. అందకే కొన్నేళ్లుగా నడుస్తుంది. ఒకవేళ మా సంస్థ ఫేక్ అయితే ఈ పాటికే మమ్ములను అరెస్టు చేసే వారు కదా.. సెంట్రల్ గవర్నమెంట్ నుంచే పర్మిషన్ ఉంది. ప్రధాని మోదీ సైతం నెట్‌వర్క్ మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలని పార్లమెంట్‌లో మాట్లాడారు. మా సంస్థకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ నమ్మిస్తారు. తమిళనాడుకు తీసుకెళ్లి కోయంబత్తూర్‌లోని కార్యాలయాన్ని సైతం చూపిస్తామంటారు. ఇలా తమిళనాడు కేంద్రంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ దందా నడుస్తున్నది. తెలంగాణలో దాదాపు మూడేళ్లుగా ఇది ఆపరేట్ అవుతుంది. ఇటీవల కొయంబత్తూరు పోలీసులు వై వీ2 యాడ్స్ కంపెనీని స్థాపించిన శక్తి ఆనంద్‌ను, కంపెనీ డైరెక్టర్లను అరెస్టు చేశారు. ఆరు నెలల అనంతరం నెల రోజుల క్రితం వీరంతా బయటికి వచ్చారు. యాప్‌ను పోలీసులు లాక్ చేశారు. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుంది. ఇంత జరుగుతున్నా.. ఇప్పటికీ నిర్వాహకులు పెట్టుబడి పెట్టిన వ్యక్తులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. మార్చి 5వ తేదీన కోర్టులో కేసు హియరింగ్ ఉంది. మనమే కేసు గెలుస్తున్నాం. తిరిగి ప్రారంభిస్తాం. మీ డబ్బులు ఎటూ పోలేదంటూ వాట్సాప్ గ్రూపుల్లో మేసేజ్‌లు పెడుతున్నారు.

“ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్. ఓ ప్రైవేట్ కాలేజీలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. మంచిర్యాల జిల్లాలో తనకు బాగా తెలిసిన మరో టీచర్ ఈ మై వీ3 యాప్ గురించి వివరించాడు. కొన్నేళ్లుగా నెలకు లక్షల్లో సంపాదిస్తున్నానని.. తన కింద వేలాది మంది జాయిన్ అయ్యారని. గతేడాదే సొంత ఇల్లు కట్టుకున్నానని.. కారు కూడా కొన్నానంటూ చెప్పుకొచ్చాడు. బాగా తెలిసిన వ్యక్తి, పైగా తనతో పని చేసిన టీచర్ కావడంతో శ్రీనివాస్ రూ.1,20,000 పెట్టుబడి పెట్టాడు. ఇప్పుడు యాప్ పని చేయడం లేదు. తనతో డబ్బులు కట్టించిన ఫ్రెండ్‌కు ఫోన్ చేస్తే సార్ వాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు నడుస్తుంది. నీ డబ్బులు నీకు ఇస్తారు. కానీ కొన్ని రోజులు ఆగాలంటూ చెప్పాడు. కేస్ ఎందుకైంది. ఇది జన్యూన్ యాప్ అని చెప్పావ్ కదా.. నాకు తెలియదు నువ్వే డబ్బులు ఇవ్వాలంటూ శ్రీనివాస్ గట్టిగా నిలదీయడంతో కాల్ కట్ చేశాడు. ఎన్నిసార్లు చేస్తున్నా ఫోన్ రిసీవ్ చేయడం లేదంటూ శ్రీనివాస్ వాపోతున్నాడు.”

మార్చి 5న కేసు హియరింగ్ ఉంది.. మనమే కేస్ గెలుస్తున్నాం అంటూ గ్రూప్‌లో ప్రచారం చేస్తున్న స్క్రీన్‌షాట్


Special Sessions Court for trial of cases under the TNPI[D]
Coimbatore
Case Details

| | | | |
|---|---|---|---|
| Case Type | CRLMP - CRIMINAL MISCELLANEOUS PETITION | | |
| Filing Number | 52/2025 | Filing Date | 18-02-2025 |
| Registration Number | 53/2025 | Registration Date: | 18-02-2025 |
| CNR Number | TNCB060000702025 (Note the CNR number for future reference) | | View QR Code / Cause Title |

Case Status

| | |
|---|---|
| First Hearing Date | 18th February 2025 |
| Next Hearing Date | 05th March 2025 |
| Case Stage | Enquiry |
| Court Number and Judge | 8-Special Judge (TNPID) |

Petitioner and Advocate

1) Sakthi Ananthan —Petr/Accused No.23 (Cr.No.9/2024)
Advocate- Anantharaju.R

Respondent and Advocate

1) State rep by DSP, EOW, Coimbatore —Res/Com

Acts

| Under Act(s) | Under Section(s) |
|---|---|
| Bharatiya Nagarik Suraksha Sanhita | 483(1)(b) |

Case History

| Judge | Business on Date | Hearing Date | Purpose of Hearing |
|---|---|---|---|
| Special Judge (TNPID) | 18-02-2025 | 21-02-2025 | Await Notice |
| Special Judge (TNPID) | 21-02-2025 | 01-03-2025 | Await Notice |
| Special Judge (TNPID) | 01-03-2025 | 05-03-2025 | Enquiry |

### నమ్మి మోసపోవద్దు



ఇంట్లో కూర్చొని యాడ్స్ చూస్తూ డబ్బులు సంపాదించుకోవచ్చని వచ్చే వారిని నమ్మకండి. అది మోసమేనని గ్రహించండి. ఊరికే డబ్బులు ఎవ్వరూ ఇవ్వరు. నెట్‌వర్క్ మార్కెటింగ్, చైన్ సిస్టమ్ మార్కెటింగ్‌లకు ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వదు. ఇలాంటి యాప్‌లను ఎవరూ నమ్మొద్దు. ఎవరైనా వచ్చి సంప్రదిస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయండి. ఈజీ ఎర్నింగ్ యాప్‌లను నమ్మి పెట్టుబడులు పెట్టకపోవడమే మంచిది. ఈ తరహా మోసాలపై అప్రమత్తంగా ఉండాలి.

*- ఎం.శ్రీనివాస్, రామగుండం సీపీ*

# కనిపించిన నెలవంక

- నేటి నుంచి ఉపవాసాలు
- 31న రంజాన్ పండుగ



దండేపల్లి, మార్చి1 : ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. శనివారం నెలవంక కనిపించడంతో ఆదివారం నుంచి అత్యంత కఠినంగా ఉపవాసాలు కొనసాగనున్నాయి. మార్చి 30న శవ్వాల్ నెలవంక కనిపిస్తే.. 31న రంజాన్ పండుగ జరుపుకోనున్నారు. ఈ మాసంలోనే దివ్య ఖురాన్ అవతరించిందని ముస్లింల విశ్వాసం. ఖురాన్‌లోని 30 అధ్యయాలు ఈ మాసంలోనే పూర్తి చేస్తారు. దీనినే తరావి నమాజ్ అంటారు.

#### హలీం రుచులు సిద్ధం

రంజాన్ మాసంలో లభించే ప్రత్యేక వంటకం హలీం. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ వరకే పరిమితమైన హలీం దశాబ్ద కాలంగా జిల్లాలోని ముఖ్య పట్టణాలైన మంచిర్యాల, చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపెల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ పట్టణాలకు విస్తరించింది. హలీం, డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్స్ విక్రయాలకు పెద్ద స్టాళ్లను ఏర్పాట్లు చేస్తున్నారు. మసీదులను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు.

# యూరియ కోసం పడిగాపులు

జన్నారం, మార్చి 1 : యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట రైతులు జలపతిరావు, అడే లక్ష్మణ్, కేవు నాయక్ పడిగాపులు కాస్తూ కనిపించారు. వారు మాట్లాడుతూ యూరియా బస్తాల కోసం రెండు రోజులుగా పీఏసీఎస్ చుట్టూ తిరుగుతున్నామని, నాలుగు బస్తాలు అవసరముంటే ఒకే బస్తా ఇస్తున్నారని, పంటలు చేతికొచ్చే సమయంలో ఎరువులు ఇవ్వకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోయే పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు చొరవచూపి రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ చేయాలని వారు వేడుకున్నారు. ఈ విషయమై ఏవో సంగీతను వివరణ కోరగా, పంటలకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచుతున్నామని, వేయి మెట్రిక్ టన్నులు అవసరముండగా, 760మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని, ఈ రోజు 90 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ వస్తుందని, వెంటనే రైతులకు పంపిణీ చేస్తామన్నారు.




జన్నారంలోని పీఏసీఎస్ వద్ద నిరీక్షిస్తున్న రైతులు

# ‘హస్తం’లో ఆధిపత్య పోరు!

## డీసీసీ ప్రెసిడెంట్-నియోజకవర్గ ఇన్‌చార్జి మధ్య ముదురుతున్న వివాదం

- జిల్లా అధ్యక్షుడు, ఆయన అనుచరులపై కేసు పెట్టిన శ్యాంనాయక్
- అధిష్ఠానం దృష్టికి పంచాయితీ.. హైదరాబాద్‌కు ఇరు వర్గాల నేతలు!



కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య ఆధిపత్యపోరు రోజురోజుకూ ముదురుతున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి ఓటమిపాలైన శ్యాం నాయక్-జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు మధ్య పచ్చిగడ్డివేస్తే భగ్గుమనే స్థాయిలో వివాదం చెలరేగుతున్నది. నిత్యం ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. గత నవంబర్ 2న జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో శ్యాంనాయక్‌కు సమాచారమివ్వకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారంటూ ఆయన వర్గీయులు ప్రశ్నించగా, మాటామాట పెరిగి కొట్టుకునే వరకూ వెళ్లింది. ఈ ఘటనతో ప్రారంభమైన వివాదం రోజురోజుకూ ముదిరి కేసులు సైతం పెట్టుకునే స్థాయికి వెళ్లింది.

#### పరస్పర ఆరోపణలు..

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుతో పాటు అతని వర్గానికి చెందిన మరికొంత మంది నాయకులపై నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ చేసిన ఫిర్యాదు మేరకు ఇటీవల పోలీసులు వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయగా, మరోసారి వివాదం చెలరేగింది. శ్యాంనాయక్ వర్గీయులు.. దాడిచేసినట్లుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అంటే విశ్వప్రసాద్ ఒక్కరేనన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, ఏళ్లకేళ్లు డీసీసీ పదవిని తనదగ్గరే ఉంచుకొని పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటున్నారని నియోజకవర్గం ఇన్‌చార్జి శ్యాంనాయక్ ఆరోపిస్తున్నారు. విశ్వప్రసాద్ ఒంటెద్దుపోకడల వల్లే జిల్లాలో పార్టీ అన్ని విధాలా నష్టపోతుందని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఇతర పార్టీతో కుమ్మక్కవ్వడం వల్లే సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి చెందిందని, బేసిక్‌గా కాంట్రాక్టర్ అయిన విశ్వ ప్రసాదర్‌రావు జిల్లాలో ఏకచక్రాధిపత్యం వహిస్తూ కిందిస్థాయి కార్యకర్తలను రాజకీయంగా ఎదగకుండా చేస్తున్నార ని శ్యాంనాయక్ ఆరోపిస్తున్నారు. ఇక ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్యాంనాయక్ చేస్తున్న ఆరోపణలపై డీసీసీ ప్రెసిడెంట్ విశ్వప్రసాద్ వర్గం నాయకులు మండిపడుతున్నారు. శ్యాంనాయక్ చేసిన ఆరోపణలపై ఇటీవల మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు స్పందించారు. పార్టీకి నష్టం చేసేవిధంగా శ్యాంనాయక్ వ్యవహార శైలి ఉంటుందని ఆరోపించారు. సొంత పార్టీ నాయకులపై కేసులు పెట్టడం సరికాదని చెప్పుకొచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ముదురుతున్న పంచాయితీ అధిష్ఠానం దృష్టికి వెళ్లడంతో ఇరువర్గాల నేతలను హైదరాబాద్ పిలిపించుకున్నట్లు తెలిసింది.

# నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకం

### రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, మార్చి 1 : నేరాల నియంత్రణతో పాటు నార్కోటిక్, ఎక్స్‌ప్లోసివ్ గుర్తింపులో పోలీస్ జాగిలాల పాత్ర కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఏడాది పాటు శిక్షణ పొందిన 24వ బ్యాచ్‌కు చెందిన జాగిలాలు శుక్రవారం పాసింగ్ అవుట్ పూర్తి చేసుకొన్నాయి. అందులోని మూడు జాగిలాలను శనివారం రామగుండం కమిషనరేట్‌కు తీసుకవచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేరస్తులను త్వరగా గుర్తించడానికి జాగిలాలను ఉపయోగిస్తామన్నారు. అనంతరం డాగ్స్, డాగ్స్ హాండ్లర్స్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, సీసీ హరీశ్, తదితరులు పాల్గొన్నారు.



జాగిలాలను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

### ఆసరా పింఛన్‌లపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్ లెక్కల మల్లయ్య

జన్నారం, మార్చి 1 : ఆసరా పింఛన్‌లపై నిర్లక్ష్యం తగదని, నెల రోజులు గడచినా ఇవ్వకపోవడం వల్ల వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వయోవృద్ధుల సంఘం నాయకులు లెక్కల మల్లయ్య, వీరయ్య, సీ రామన్న, రాజమౌళి పేర్కొన్నారు. శనివారం జన్నారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. సకాలంలో పింఛన్ డబ్బులు ఇవ్వకపోవడం వల్ల వాటిపై ఆధారపడి జీవిస్తున్న ఎంతో మంది పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రతినెలా ఆసరా పింఛన్ ఇచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే పింఛన్ డబ్బులు జమ చేసి ఆదుకోవాలని కోరారు.

